# రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

## పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం వంటి ప్రాథమిక హక్కులను పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్‌లో నిర్వహించిన సిఎల్ సి అవగాహన తరగతుల్లో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిఎల్ సి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులను ముందస్తు హెచ్చరిక లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం వారి జీవించే హక్కుకు విఘాతం కలిగిస్తోందని అన్నారు. ఇలాంటి పరిస్థితులను అరికట్టేందుకు సాఫ్ట్ వేర్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు కనీస వేతనాలు, రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం కూడా జీవించే హక్కులో భాగమేనని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ర్యాలీలు నిర్వహించే హక్కును కూడా ప్రభుత్వాలు పరిమితం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. పౌష్టికాహారం అందక ప్రజలు ఆకలితో






మరణించడం కూడా జీవించే హక్కుల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. హక్కుల కోసం ప్రశ్నించే వారిపై దేశద్రోహం వంటి ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో లాకప్ మరణాలు, ఎన్‌కౌంటర్లు, వరకట్న హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎల్ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడంతో పాటు పర్యావరణ విధ్వంసాన్ని అడ్డుకోవడం, ప్రకృతి వనరులను కాపాడడం, నిమ్న వర్గాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడం, మహిళల హక్కులను రక్షించేందుకు ప్రజలు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఎల్ సి జిల్లా అధ్యక్షుడు వి. సంగం మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రభావం పాలనా వ్యవస్థపై పెరుగుతోందని, దేశ సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. సిఎల్ సి రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్ మాట్లాడుతూ, పౌర హక్కుల సంఘం రాజ్య హింసను ప్రశ్నించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛ, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణ, మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణతో పాటు విద్య, వైద్యం వంటి రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం కూడా పోరాటాన్ని విస్తరించుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎల్ సి జిల్లా నాయకులు భీక్ సింగ్, జెలందర్, ఎడ్ల రాము, విజయ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ పట్టాభిషేక ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఇందూర్ ముఖద్వారం వద్ద ఉన్న శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం సమీపంలో హిందూ పట్టాభిషేక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం శివాజీ మహారాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, స్థానిక ప్రజలు, యువత, సేవాసమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ సేవాసమితి అధ్యక్షులు శివాజీ లక్ష్మణ్ మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం హిందూ సమాజానికి అత్యంత పవిత్రమైన చారిత్రక ఘట్టమని అన్నారు. ప్రతి హిందువు ఈ రోజును గౌరవంగా జరుపుకోవాలని, ముఖ్యంగా యువత శివాజీ మహారాజ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పాఠశాలల పాఠ్యాంశాల్లో శివాజీ మహారాజ్ చరిత్రకు సంబంధించిన సుమారు 20 పేజీల సమాచారాన్ని చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో శివాజీ మహారాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో వివిధ అవగాహన, సాంస్కృతిక, చారిత్రక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబదాస్ రావు, ఏ. రాజా రెడ్డి, డాక్టర్ రామ్మోహన్, రాజేష్ తివారి, మల్లేష్, మనోజ్ మాస్టర్, శ్రీనివాస్, భరత్ రాజ్,



దుర్గాప్రసాద్ దిగంబరు, విజయ్ కుమార్, ముజే భాస్కర్ రావు, అర్జున్ రెడ్డి, చందు అన్న, హరీష్, కార్తీక్, నాగరాజ్ అన్న, రేవంత్



అన్న, ప్రణయ్ తదితర సేవాసమితి సభ్యులు, పెద్దలు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోలియో రహిత భారత నిర్మాణంలో పల్స్ పోలియో కీలకం

## జుక్కల్ సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్

జుక్కల్, బతుకమ్మ :పోలియో రహిత భారత నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని జుక్కల్ సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ అన్నారు. ఆదివారం జుక్కల్ గ్రామపంచాయతీ ఆవరణలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి 0–5 సంవత్సరాల చిన్నారులకు జుక్కల్ సర్పంచ్ పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు వికలాంగులు కాకుండా పోలియో చుక్కలను వేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా అందరూ స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్నింటిలోనూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేవలు అందిస్తున్నారని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జుక్కల్ సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ మాట్లాడుతూ, పోలియోను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందడం అత్యంత అవసరమని అన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గడుగు గంగాధర్ నివాసాన్ని సందర్శించిన టీపీసీసీ అధ్యక్షులు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ నివాసాన్ని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జరిగిన నష్టంపై విచారం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తరఫున అందుబాటులో ఉన్న సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాల కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు.






# ఆర్థిక సంక్షోభం నుంచి దేశానికి విముక్తి కలిగించిన ఆర్థిక వేత్త పీవీ

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఎల్పీజీ విధానంతో ఆర్థిక సంక్షోభం నుండి భారత దేశాన్ని విముక్తి కలిగించిన ఆర్థిక వేత్త పీవీ అని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ భవన్ లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేతృత్వంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుభాషావేత్తను ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం పూర్వ జన్మ సుకృతం అని అన్నారు. 1991 లో తను తీసుకున్న ఆర్థిక పర విధానాలతోనే నేడు భారత దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి రోష్ని జైస్వాల్, జిల్లా యూత్ ఇంచార్జి వినోద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అబ్దుల్ అద్నాన్, ఆదిత్య పాటిల్, రాజు గౌడ్ జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అబ్బోల్ల శ్రీకాంత్, అసెంబ్లీల అధ్యక్షులు మహేందర్, మెయిన్ యూనిస్, మండలాల అధ్యక్షులు గైని కిరణ్, వినోద్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు లైన్ కిరణ్, లోక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జుక్కల్‌లో సెంట్రల్ లైన్ పనులు వేగవంతం



జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ పట్టణంలో సెంట్రల్ లైన్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని స్థానికులు తెలిపారు. గత ప్రభుత్వం ఈ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ అమలు చేయలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక చొరవతో సెంట్రల్ లైన్ పనులు వేగవంతమయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో రహదారులు, మౌలిక సదుపాయాలు, పాత బస్టాండ్ అభివృద్ధి వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే జుక్కల్‌కు మున్సిపాలిటీ హోదా కల్పిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలు చేయలేదని ప్రజలు గుర్తుచేశారు. జుక్కల్ సర్పంచ్ సావిత్రి సాయి గౌడ్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని స్థానికులు ప్రశంసించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు.

# లైన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ కు అవార్డుల పంట..

రుద్రూర్, బతుకమ్మ :హైదరాబాద్ లోని నిమ్మల కన్వెన్షన్ హాల్ లో 320 డి ఆధ్వర్యంలో ఆదివారం అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్రంలో ఉన్న నూట అరవై ఎనిమిది క్లబ్బుల వారు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి వారికి అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా లైన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ వారు 9 మాసాలలో 213 సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని గుర్తించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ లయన్ ఏ అమర్నాథ్ రావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆదుకుంటున్న లైన్స్ క్లబ్ రుద్రూర్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ లైన్ ఘట్టమనేని బాబురావు, గవర్నర్లు, మాజీ గవర్నర్లు, రుద్రూర్ క్లబ్ అధ్యక్షులు లయన్ కెవి మోహన్, కార్యదర్శి లయన్ గుండురు ప్రశాంత్ గౌడ్, జిల్లా చైర్మన్ లయన్ శ్యాంసుందర్ పహాడే, డైరెక్టర్ లయన్ పార్వతి ప్రశాంత్, జిల్లాలో ఉన్న అన్ని క్లబ్ ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

